# హాల్మార్కేడ్

-ఎం.సి. ఆంజనేయులు

నలభై ఏళ్ల క్రితం నాటి మాట:

అది సముద్ర తీర ప్రాంతమయిన కడగండ్లవారిపాళెం. ఉప్పెనలకు నిత్యనివాసమయిన ఓ కుగ్రామం అది. సముద్రం తరచూ పొంగి పొర్లడంతో, పాళెంలోని పేద మత్స్యకారుల కొంపలూ, గూళ్ళూ ముంపుకు గురి అయి, వాళ్ళు అనుభవించే బాధలు వర్ణనాతీతం.

'అయ్యా! మా గ్రామం మునిగిపోకుండా వూరి చుట్టూ ఓ మట్టికట్ట పోయించండి; మమ్మల్నీ, మా ఆస్తిపాస్తుల్నీ కాపాడండి' అంటూ ముప్ఫై సంవత్సరాలుగా కడగండ్ల వారిపాళెం గ్రామస్థులు, ప్రభుత్వానికి అర్జీల మీద అర్జీలు పెట్టుకుంటున్నా, వారి మొర ఆలకించే నాధుడే కరువయ్యాడు. ఇప్పుడు, ఎలక్షన్లు దగ్గర పడడంతో, పాలకుల కళ్ళల్లో కడగండ్ల వారిపాళెం కదలాడింది. ఇంకేముంది "మీరు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఉప్పెన రక్షిత కట్టను వెంటనే నిర్మిస్తాం! మీ కలలు సాకారం చేస్తాం!!" అంటూ వాగ్దానం చేసింది ప్రభుత్వం.

అర్ధవర్తులాకారంలో, పల్లెను రక్షిస్తూ, మైలున్నర పొడవు గల ఫ్లడ్‌బ్యాంక్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతించడం, ప్లాన్లూ ఎస్టిమేట్లు చకచకా తయారయి పోవడం, ఎలక్షన్ల ముందే బ్యాంక్ నిర్మాణం పూర్తి చెయ్యాలన్న ప్రభుత్వ ఆజ్ఞలు అందుకున్న పబ్లిక్ వర్క్సు శాఖ ఇంజనీర్లు, నిర్మాణం పనిని పేరున్న కంట్రాక్టర్‌కి అప్పగించడం, నిర్ణీత ప్లాను ప్రకారం, మట్టికట్ట నిర్మాణం పూర్తి కావడం, ఒక దాని వెంట మరొకటి జరిగి పోయాయి. నిలువెత్తున, తమ ముందున్న 'రక్షిత మట్టి కట్ట'ను చూచుకొని కడగండ్లవారిపాలెం గ్రామస్థులు, తమ కష్టాలిక గట్టెక్కాయని సంతోషించారు.

కట్టపని అన్నివిధాల పూర్తవడంతో, ఇక కంట్రాక్టర్కి ఫైనల్ బిల్లు చెల్లించడ మొక్కటే మిగిలింది.

సరిగ్గా అప్పుడే జరిగిందీ సంఘటన:

పట్టణానికి ఓ మైలు దూరంలో, దాదాపు అరవై ఏళ్ళ క్రితం, ఆనాటి బ్రిటీష్ ఇంజనీర్ కోసమని పి.డబ్ల్యు.డి. నిర్మించిన అధికార నివాస గృహమిది. చుట్టూ విశాలమైన ఆవరణ, వెనుక పక్క సర్వెంట్ క్వార్టర్స్, రకరకాల పళ్ళ చెట్లూ, పూల మొక్కలతో ఓ ఉపవనం, బంగళాని పరిరక్షిస్తూ చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ, ఇన్నేళ్లయినా ఇప్పటికీ చూపరులను ఆకర్షించే ఆ 'దొరల బంగళా' ప్రస్తుతానికి కొస్తే - అది ఆ ప్రాంతానికి పెద్ద ఇంజనీరైన - ఎస్ఇ గారి నివాసం.

అలవాటు ప్రకారం, ఉదయం ఆరుగంటల వేళ, ఇంటి చుట్టూ వున్న 'నడక బాట' మీద పచార్లు చేస్తున్నాడు ఎస్ఇ. ఉన్నట్లుండి గేటు వద్ద ఓ అజ్ఞాత వ్యక్తి తచ్చాడడం చూచి, 'లోపలకి రా' అన్నట్లు సైగ చేశాడు ఎస్ఇ

లోపలికి వచ్చిన వ్యక్తి, వంగి ఎస్ఇకి నమస్కరించాడు. "దొరగారూ! కడగండ్ల వారిపాళెం గ్రామానికి కాస్తా ఎగువ గ్రామమయిన, మన్నూరు అనే గ్రామ రైతుని నేను. పేరు హరిశ్చంద్రప్రసాద్ అంటారు. కడగండ్లవారిపాళెం వద్ద, మీ డిపార్టుమెంటు వారు ఈ మధ్య ఓ ఫ్లడ్ బ్యాంక్ నిర్మించారు. తమరికీ విషయం తెలిసే వుంటుంది. అందుగ్గానూ, మా అయిదారు గ్రామ ప్రజల తరపున, తమరికి మా కృతజ్ఞతలు తెల్పుకుందామని ఇంత దూరమొచ్చాను. కానీ, దొరగారూ, మీరు అన్యథా భావించనంటే, నాదో విన్నపం. మీరు ఆజ్ఞాపిస్తే నివేదించుకుంటాను.." వినమ్రతగా ఎస్ఇ వేపు చూశాడు, హరిశ్చంద్ర ప్రసాద్.

"ఊ... ఏమిటది?" అన్నట్లు చూశాడు. ఎస్ఇ.

"సదరు మట్టికట్ట నిర్మాణంలో మట్టి తిన్నారయ్యా, మీ క్రింది అధికారులు కొందరు. నన్ను నమ్మండి దొరగారూ! మట్టి కట్టకి ఉపయోగించిన మట్టి, మా వూరి పొలిమేరల్లోని, పోరంబోకు భూముల్లోంచి తవ్వితీశారు.

ఒక్కమారు మీరొచ్చి, ఆ తవ్వకాలను తనిఖీ చేయండి, నిర్మాణం పనిలో చోటు చేసుకున్న కుంభకోణం ఏ పాటిదో మీకు అర్థమవుతుంది. నేనేదైనా తప్పుగా మాట్లాడి వుంటే – దొరగారూ – నన్ను క్షమించండి". చేతులు మరో మారు జోడించి నమస్కరిస్తూ – "తమరు అనుమతిస్తే ఇక సెలవు పుచ్చుకుంటాను" అంటూ వినయంగా ఎస్ఇ వేపు చూశాడు, హరిశ్చంద్రప్రసాద్.

"సరే! నేను స్వయంగా వచ్చి విచారణ జరుపుతాను. క్రింది అధికార్లు ఎవరయినా అవినీతికి పాల్పడి నట్లు నాకు గట్టి నమ్మకం కుదిరితే వాళ్ల మీద తప్పక చర్య తీసుకుంటాను" 'మీరెళ్ళొచ్చు' అన్నట్టు తలాడించి, తన పచార్ల కార్యక్రమం కొనసాగించాడు ఎస్ఇ

కడగండ్లవారిపాలెం వద్ద నిర్మితమవుతున్న రక్షిత కట్ట విషయమై, మూడ్రోజుల క్రితమే ఇఇ వద్ద నుంచి తనకు ప్రోగ్రెస్ రిపోర్టు అందింది. మాటల సందర్భంలో ఇఇ ఆ పని పర్యవేక్షిస్తున్న సూపర్‌వైజర్ నేతాజీని మెచ్చుకుంటూ, ఎంతో స్పార్కున్న, మంచి భవిష్యత్తున్న వ్యక్తిగా అభివర్ణించడం, తనింకా మర్చిపోలేదు.

'పని చేపట్టనంతవరకు ప్రాణాలు తీస్తారు. తీరా అయ్యాక అవినీతి... అవినీతి అంటూ దుమ్మెత్తి పోస్తారు... ఛీ... ఛీ... మన దేశం బాగుపడే దెప్పుడో! నడక ముగించుకొని, ఇంటి లోపలికి వెళ్ళిపోయాడు ఎస్ఇ.

మరునాటి ఉదయం పది గంటల సమయంలో ఇఇ గారి ఆఫీసు గదిలో ఫోను మ్రోగింది.

మార్చి మాసమవడం వల్ల, బల్లమీదున్న బిల్లుల మీద సంతకాలు పెట్టడంలో యమబిజీగా వున్నాడు ఇఇ. గది బయట వున్న బిళ్ళ బంట్రోతు పరిగెత్తుకుంటూ వచ్చి ఫోనెత్తాడు.

"అయ్యగారూ! ఎస్ఇ దొరగారు లైన్లో వున్నారు. తమరితో అర్జంటుగా మాట్లాడాలట!" అంటూ ఫోనందించాడు బంట్రోతు.

"నమస్కారం సార్! అయ్యా! ఆయ్... ఆయ్ వింటున్నానండయ్యా. నాకు తెలీదండయ్యా! సార్... సార్... ఓ గంటలో బయలుదేరి వస్తున్నారా? ఆ సరేనండయ్యా! నేను రెడీగా వుంటాను. అవునండయ్యా. రోడ్డు అంత బాగోదు. ఒకటి చేద్దామండయ్యా. తమరి కార్ని ఇక్కడే వుంచేసి మనం జీపులో వెళ్దామండయ్యా. ఏమండయ్యా? ఏఇని సూపర్‌వైజర్‌ని యం బుక్కులు, ప్లాన్లూ, ఎస్టిమేట్లూ, అన్నీ తీస్కొని, కడగండ్లవారి పాళెం విలేజి దగ్గర వెయిట్ చెయ్యమంటానండయ్యా! సరిపోద్దిగదండయ్యా! ఉంటానండయ్యా" ఫోన్ పెట్టేశాడు ఇఇ.

"ఈ ఎస్ఇకి పనీ పాటాలేదు. ఎవడో కోన్‌కిస్కాగాడు కంప్లెయింట్ ఇచ్చాడట. ఈయనగారే స్వయంగా వచ్చి తనిఖీ చేస్తాడట. ప్రమోషన్ మీద ఈ మధ్యనే వచ్చి చేరాడు కదా. కొత్త బిచ్చగాడు! ఆనెస్ట్ అండ్ కమిటెడ్ ఆఫీసర్ అని తెగ మురిసి పోతున్నాడు. తనిఖీ చేసుకుంటే చేసుకోనీ – నాదేం పోతుంది. అయినా, ఏముంది బంగారం దోచుకుందుకు ఆ మట్టి గుంతల్లో..." వారం రోజుల క్రితం కడగండ్ల వారి పాలెం వద్ద మట్టికట్టను ఇన్‌స్పెక్ట్ చేసి, ఎఇ చెక్ చేసిన గుంతల కొలతల్ని సూపర్‌చెక్ చేసిన ఇఇ సర్‌ప్రైజ్ విజిట్‌కి ఎస్ఇ వస్తున్నాడని వినగానే విసుగ్గా మొహం పెట్టాడు.

పదకొండు గంటల 15 నిముషాలకు ఎస్ఇ కారు వేగంగా వచ్చి ఇఇ ఆఫీసు ముందు ఆగింది.

ఆగిన కారులోంచి ముందు అటెండర్ దిగి, డోరు తెరవగానే ఎస్ఇ దిగాడు.

అక్కడే వున్న ఇఇ, ఎదురేగి ఎస్ఇకి నమస్కరించాడు.

అప్పటికే రెడీగా వున్న జీపులో ఇంజనీర్లిద్దరూ, వాళ్ళ బంట్రోతులు వెంటరాగా, బయలు దేరారు. కడగండ్లవారిపాళెం మట్టికట్ట ప్రారంభమయ్యే చోటుకి వచ్చి వారు చేరుకునేటప్పటికి ముప్పావు గంట పట్టింది.

అప్పటికే డిపార్టుమెంటల్ హైరార్కీ అంతా ఆ స్థలంలో గుమిగూడి వుండడం చూచి, ఎస్ఇ ఆశ్చర్య పోలేదు. అదంతా డిపార్ట్‌మెంటులో సర్వసాధారణమే.

జీపులోంచి దిగీ దిగగానే, శీతల పానీయాలతో, కొబ్బరి బొండాలతో, రకరకాల పళ్ళతో, ఫలహారాలతో కాఫీ ఫ్లాస్కులతో తన ముందు ప్రత్యక్షమయిన తన క్రింది స్టాఫ్‌ని చూచి

నవ్వుకున్నాడు ఎస్ఇ

'తల్చుకోవాలే కానీ అరణ్యంలో కూడా ఆపిల్ వళ్లా - ఐస్‌క్రీములు సృష్టించగల మహామేధావులు మా వాళ్ళు!' అని మనసులోనే అనుకొని, "ఇప్పుడవేమీ అక్కర్లేదు నాకు. ఇఇ గారి నడగండి. ఆయనకి కావాలేమో!" అంటూ నవ్వుతూ ఇఇ కేసి చూశాడు ఎస్ఇ

తనపై అధికారి, బంట్రోతిచ్చిన కూజా నీళ్ళు పుచ్చుకుంటుంటే తను మాత్రం శీతల పానీయాలు, పళ్ళు - ఫలహారాలు పుచ్చుకుంటే ఏం బాగుంటుంది! పాపం ఇఇ గారు కూడా ఓ గ్లాసుడు మంచి నీళ్ళతో సరిపుచ్చుకున్నారు.

ఇంతలో ఏఇ సంబంధిత రక్షిత కట్ట ప్లాన్లూ, ఎస్టిమేట్లూ తీసుకొని వచ్చి ఎస్ఇకి చూపించాడు. ఓ అర్ధగంట వాటన్నిటినీ స్టడీ చేశాక రక్షిత కట్టపై భాగం చేరుకొని, కట్ట నిర్మాణ నాణ్యత పరీక్షిస్తూ కొంతదూరం నడిచాడు ఎస్ఇ.

"గుడ్, డిజైన్ ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు కదా! ముందు వైపు రివెట్‌మెంట్ కూడా కట్టారు. దట్స్‌నైస్. ఇక ఉప్పెనల నుంచి ఈ గ్రామస్తులు బయట పడినట్లే!

అన్నట్టు - మట్టిని తెచ్చిన మన్నూరు గ్రామానికొక మారు వెళ్లి పిట్స్‌ని చూసి వద్దామా? పదండి వెళ్దాం..." అంటూ పక్కనున్న ఇఇ కేసి చూశాడు ఎస్ఇ.

జీపులన్నీ మన్నూరుకేసి పరుగులు తీశాయి. 15 నిముషాల్లో మన్నూరు గ్రామ పొలిమేర్లలోని మట్టికందకాల వద్దకు జీపులు వచ్చి చేరుకున్నాయ్. ఆగిన జీపుల్లోంచి అందరూ దిగారు.

దీర్ఘ చతురస్రాకారంలో తవ్విన వందలాది గుంతలన్నీ, నీరు లేని ఈత కొలనుల వలే కన్పిస్తున్నాయ్.

ప్రతి గుంత ముందూ, ఆ 'పిట్' సంఖ్య తెలియచేస్తూ పొడుగాటి రాళ్ళు. ఆ రాళ్ల మీద నల్ల పెయింట్‌తో వేసిన అంకెలు అప్పుడే మాసిపోతున్నాయి.

"ఓ.కే. యం బుక్కులు పట్రండి. ఓ మారు కొలతల్ని రాన్‌డమ్‌గా అక్కడికక్కడే చెక్ చేస్తాను" అంటూ ఏయి వేపు చూశాడు ఎస్ఇ.

అతి వినయంగా ఒక యం బుక్కును, రెండు చేతులు చాపి ఎస్ఇకి సమర్పించాడు ఎఇ.

యం బుక్కులోని మొదటి రెండు మూడు పేజీలు తిప్పాడు ఎస్ఇ

"పదవ నెంబరు పిట్ వద్దకు పదండి. ఆ పిట్ కొలతల్ని చెక్ చేద్దాం" అన్నాడు ఎస్ఇ

సూపర్‌వైజర్ నేతాజీ పర్యవేక్షణలో ఇద్దరు ముగ్గురు మేస్త్రీలు, పదవ నంబరు పిట్ యొక్క కొలతల్ని టేప్ సహాయంతో కొలవడం మొదలెట్టారు. కొలతలనన్నింటినీ స్వయంగా గమనిస్తూ, యం బుక్కులోని ఎంట్రీస్‌తో వాటిని సరిచూస్తూ ముందుకు సాగిపోయాడు ఎస్ఇ.

అలా... అలా... దాదాపు పాతిక గుంతల కొలతలు - పొడవు, వెడల్పూ ఎత్తూ - తనిఖీ చేసిన ఎస్ఇకి ఆశ్చర్యంతో పాటూ, ఒకింత ఆనందం కూడా కల్గింది.

కొలతల్లో ఒక్క అంగుళం కూడా తేడాలేనందుకు ఆశ్చర్యం.

తనలాగే తన సిబ్బంది కూడా నీతి పరులైనందుకు ఆనందం.

అభినందన పూర్వకంగా ఎస్ఇ తమకేసి చూస్తుంటే గట్టిగా ఊపిరి పీల్చుకున్నారు. కింది ఇంజనీర్లు.

"ఇంతవరకూ కొలతలన్నీ సక్రమంగానే ఉన్నాయి. చెక్ చేసింది చాలు. ఇదిగో యం బుక్కు...." ఏఇకి యంబుక్కు అందించి తన బంట్రోతు కేసి చూశాడు ఎస్ఇ.

ఇంటి వద్ద నుంచి తెచ్చిన పెద్ద ప్లాస్కులోంచి కాఫీని కప్పుల్లో పోసి మొదట ఎస్ఇకి ఆ తర్వాత యియికి అందించాడు బంట్రోతు.

"ఊ" కాఫీని అందరికీ ఇయ్యవయ్యా..." అంటూన్న ఎస్ఇ గారి మాటలు పూర్తవక ముందే - అక్కడి నుంచి జారుకున్నారు మిగిలిన వారు.

తిరుగు ప్రయాణం.

జీపు కదిలింది. అతుకుల గతుకుల కంకర రోడ్డు మీద. జీపు ముందు సీట్లో ఇఇ ప్రక్క ఎస్ఇ కూచున్నాడు. వెనుక సీట్లోలో ఎఇ, సూపర్‌వైజర్, బంట్రోతులు సర్దుకు కూచున్నారు.

పది మైళ్ల ప్రయాణం సాగింది.

హఠాత్తుగా ఓ పెద్దమనిషి రోడ్డు కడ్డంగా ప్రత్యక్షమై చేతులెత్తి జీపు ఆపమన్నట్లు సంజ్ఞ

చేశాడు.

జీపు ఆగిపోయింది.

ఎస్ఇ గారు కూచున్న వేపుకు పరుగున వచ్చిన ఆ వ్యక్తి "అయ్యా! క్షమించండి. మీకు ఇబ్బంది కల్గిస్తున్నాను. గుంతల కొలతలన్నీ కరెక్ట్‌గా వున్నాయని భావిస్తున్నారు కదా! సూపర్‌వైజర్ దగ్గరున్న ఆ టేపు నొకమారు పరీక్షించండి. మోసమంతా ఆ టేపులోనే వుంది!" అన్నాడు.

"ఇదిగోండి సార్! అతి ధీమాగా ఏ మాత్రం తడబడకుండా తన బ్యాగులోంచి మెషరింగ్ టేపుని బయటకు తీసి, ఎస్ఇ గారి కిచ్చాడు. జీపు వెనక సీట్లో కూచొని వున్న సూపర్‌వైజర్.

టేపును అందుకున్న ఎస్ఇ అందులోంచి ఒక్కొక్క అడుగును, సరసరా బయటకు లాగుతూ, టేపునంతా చెక్ చేశాడు.

10, 20, 30, 40 , 50 60, 70, 80, 90, 100 - వంద అడుగుల కొత్త మెషరింగ్ టేపది. ఎఱ్ఱటి కేసులోనికి మళ్ళీ రీవైండ్ చేశాడు ఎస్ఇ.

ఎస్ఇకి కోపం వచ్చింది. రోడ్డు కడ్డంగా వచ్చి, అనవసరంగా తన క్రింది ఆఫీసర్ల మీద నిందమోపిన ఆగంతకుణ్ణి - చురచురా చూశాడు.

జీపు మళ్ళీ కదిలింది.

పట్టుమని ఓ మైలు కూడా వచ్చిందో లేదో... వెనక నుండి ఎవరో 'దొరగారూ... దొరగారూ..." అంటూ బిగ్గరగా కేకలేస్తూ మోటార్ సైకిల్ మీద ఫాలో అవుతూ కన్పించాడు.

జీపు స్లోడౌన్ అయింది.

మోటారు సైకిల్ మీద వస్తున్న వ్యక్తి, జీపుని ఓవర్ టేక్ చేసి రోడ్డు కడ్డంగా వచ్చి నిల్పాడు సైకిల్ని.

ఆశ్చర్యం! నిన్న ఉదయం తన బంగళాలో తను చూచిన వ్యక్తి. హరిశ్చంద్ర ప్రసాద్ ఎవరి కంప్లెయింట్ విని తనీరోజు తనిఖీకి వచ్చాడో అచ్చం - ఆ వ్యక్తే!

"దొరగారూ! నా మోటారు సైకిల్ మీద, మీ జీపుల వెనుకే వస్తున్నాను. మీరు కూచున్న జీపులోంచి ఎవరో దీన్ని పక్క పొలాల్లోకి విసిరి పారేశారు. దిగి చూద్దును కదా టేపు!" అంటూ ఓ ఎఱ్ఱటి మెషరింగ్ టేప్‌ని ఎస్ఇకి అందించాడు హరిశ్చంద్ర ప్రసాద్.

విసుగ్గా టేపు అందుకొని ఆయన వేపు ఆశ్చర్యంగా చూశాడు ఎస్ఇ

"దొరగారూ, ఈ టేపుతోటే తమరిందాక మట్టి గుంతల్ని మెషర్ చేసింది. కొలతలన్నీ సవ్యంగానే వున్నాయని భ్రమ పడ్డారు. దొరగారూ! ఈ మేజిక్ టేపులో దాగివున్న మహాత్యం - టేపునొక మారులాగి చూస్తే తమరికి తెలుస్తుంది"

అయిష్టంగానే టేపుని అటు ఇటూ తిప్పి చూశాడు. ఎస్ఇ కొక్కీ పుచ్చుకొని టేపు కొసలాగాడు. ఒక్కొక్క అడుగూ కేసులోంచి బయట పడుతోంది.

ఆశ్చర్యం!

తొమ్మిదడుగుల ॥ అంగుళాల తర్వాత వుండవలసిన పదవ సంఖ్య బదులు 20 అడుగుల సంఖ్య వుంది. దాని తర్వాత 21, 22, 23, అలా వంద వరకు వున్న మిగిలిన సంఖ్యలో మార్పులేదు.

చాకచక్యంగా గుడ్డ టేపుని 9"-11" వద్ద కత్తిరించి పదడుగులు తొలగించి, 20' వద్ద మళ్ళీ అతుకు వేశారు. జాగ్రత్తగా చూస్తే తప్ప వేసిన అతుకు కన్పించదు. మరిందాకా తను పరీక్షించిన టేపు! ఆ మాటే అన్నాడు ఎస్ఇ. హరిశ్చంద్రప్రసాదు కేసి చూస్తూ.

"అది వందడుగులు పూర్తిగా వున్న టేపు దొరగారూ! దాన్ని తమరికి చూపించి, నమ్మించ చూశాడు సూపర్‌వైజర్".

ఎంత మోసం! ప్రతి గుంత పొడవు, వెడల్పా పరిమాణాలలో వుండవల్సిన దాని కన్నా పదడుగులు ఎక్కువచేసి, క్వాంటిటీ పెంచి కంట్రాక్టర్కి లాభం గణనీయంగా చేకూర్చారు.

"ఎవరీ పని చేసింది? ఇలాంటి హల్కా టేపులు ఎన్నున్నాయి మీ వద్ద?" నిశ్చేష్టుడైన ఎస్ఇ మాటలు విన్నాడో లేదో కానీ, 'బంగారు భవిష్యత్తు' కలిగిన సూపర్‌వైజర్ "నేతాజీ" జీపులోంచి కిందికి దిగి ఎటో అదృశ్యమై పోయాడు.

■